బ్యాంకుల్లో పైసల్లేవ్

నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

మారిన సగటు మదుపరి పొదుపు • ఫండ్లవైపే భారతీయుల చూపు

రూ.0.95 లక్షల కోట్లకు పతనం

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

ఇదీ సంగతి..

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల పైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా ఆవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కఠిన చర్యలున్నా..

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

9 లక్షల కోట్లు ఆవిరి

వరుస నష్టాల్లో మదుపరులకు పెద్ద దెబ్బ

ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమోడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లె, ఎల్‌అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.

బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లలో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్యాండెడ్ యాక్సెసిరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఓప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.

ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టర్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.

తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!

సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.

ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికకావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

సింగరేణిని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

ఉద్యోగులకు లాభాల వాటా పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి

చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 7: సింగరేణిని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి లాభాల్లో కొంత శాతం పక్కనపెట్టి కంపెనీ భవిష్యత్తు కోసం, బహుముఖ వ్యాపార విస్తరణ కోసం ఖర్చు చేయనున్నామని అన్నారు. కేవలం బొగ్గు మాత్రమే కాకుండా ఇతర ఖనిజ పరిశ్రమల్లోకి కూడా సింగరేణి సంస్థ విస్తరించడానికి కృషి చేస్తోందన్నారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో సోమవారం ఉదయం ఆయన సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెక్కులను పంపిణీ చేసి ప్రసంగించారు. లాభాల వాటా, దీపావళి బోనస్‌లు, పండుగ అడ్వాన్సులు కలిపి రూ.1,261 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఒక్కో కార్మికుడికి లాభాల వాటాలో సగటున రూ.1.90 లక్షలు, దీపావళి బోనస్ కింద రూ.93,750, దసరా అడ్వాన్స్ కింద రూ.25 వేల చొప్పున చెల్లిస్తున్నట్లు వివరించారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్‌డీఎల్ ఆపరేటర్ ఆసం శ్రీనివాస్ 304 రోజులు పనిచేసి రూ.3,24,150 లాభాల వాటాను పొంది సింగరేణి టాపర్‌గా నిలిచినట్లు వివరించారు. సింగరేణి సీఎండీ బలరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, మట్టా రాగమయి తదితరులు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ సంబురాలు: టీజీఈజేఏసీ

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాల్వంచ, అక్టోబర్ 7: తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు బతుకమ్మ నిర్వహించనున్నట్లు కమిటీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు పేర్కొన్నారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ సంగం వెంకటపుల్లయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం జరుగనున్నా బతుకమ్మ వేడుకలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ కుటుంబ సభ్యులతో సహా రావాలని కోరారు. జిల్లాస్థాయి అధికారులతోపాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు హాజరుకానున్నట్లు చెప్పారు. తుక్కాని శ్రీనివాసరెడ్డి, రాణి, రాజశేఖర్, భార్గవ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించనందుకు షాపులు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న వివరాలు పరిశీలిస్తున్న ఈవో రజనీకుమారి

పాల్వంచ రూరల్; అక్టోబర్ 7: దీర్ఘకాలంగా బకాయిలు చెల్లించనందున పెద్దమ్మగుడి ఆవరణలో ఉన్న రెండు షాపులను దేవాలయ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈవో రజనీకుమారి కథనం ప్రకారం.. ఆలయ ఆధీనంలో షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. వరంగల్‌కు చెందిన గణేశ్ అనే వ్యక్తి పాత షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఒక షాపు, కొత్త కాంప్లెక్స్‌లోని మరో షాపు నిర్వహిస్తున్నాడు. ఎనిమిది నెలలుగా దేవస్థానానికి అద్దె బకాయిలు చెల్లించడం లేదు. పలుసార్లు అతడికి నోటీసులు అందించినా స్పందించడం లేదు. దీంతో దేవాదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో దేవస్థాన అధికారులు సోమవారం సాయంత్రం షాపులోని సామాన్లపై పంచనామా జరిపి షాపులను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ.20 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉందిన ఈవో తెలిపారు. దేవాదాయ శాఖ అధికారి భేల్‌సింగ్, ఈవో రజనీకుమారి, గిర్దావర్ హచ్చా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా

ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, ఆదివాసీ నాయకులు

భద్రాచలం, అక్టోబర్ 7: దుమ్ముగూడెం మండలం చింతగుప్ప గ్రామానికి చెందిన నిండు గర్భిణి ఉయికా సమ్మక్క(26)ను మూడో కాన్పు కోసం కుటుంబీకులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ఆదివారం తీసుకొచ్చారు. ఆమెను వైద్యులు పరీక్షించి, బిడ్డ సహా అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. ఆమెను కుటుంబీకులు ముందుగా దుమ్ముగూడెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆదివారం సెలవు కావడంతో అక్కడ వైద్యులు అందుబాటులో లేరు. ఆమెను సిబ్బంది చేర్చుకుని పరీక్షలు చేశారు. కొంత సేపటికి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి పంపించారు. అప్పటికే ఆమె చనిపోయింది. కుటుంబసభ్యులు మృతదేహాన్ని దుమ్ముగూడెం పీహెచ్‌సీకి తీసుకెళ్లి ఆందోళన నిర్వహించారు. వారు సోమవారం ఉదయం ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి భద్రాచలం ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. అక్కడికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. సమ్మక్క మృతికి దుమ్ముగూడెం పీహెచ్‌సీ వైద్య సిబ్బందే కారణమంటూ ఫిర్యాదు చేశారు. ఆందోళనకారులతో కలిసి పీవో కార్యాలయానికి ఎమ్మెల్యే వెళ్లారు. పీవోకు విషయాన్ని వివరించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని పీవో, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

బతుకమ్మల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి: సీతాలక్ష్మి

ఘాట్ వద్ద పనులు పరిశీలిస్తున్న సీతాలక్ష్మి

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 7: బతుకమ్మల నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 3వ వార్డు పాత కొత్తగూడెం, 12వ వార్డు గోధుమవాగు ప్రాంతాల్లోని పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్ల పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిమజ్జనం రోజు మహిళలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని, తగిన లైటింగ్ ఏర్పాట్లు చేయాలి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, మున్సిపల్ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. కౌన్సిలర్లు పరమేశ్ యాదవ్, దుర్గ, సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

9న ఫ్యామిలీ డే, బతుకమ్మ వేడుకలు

ప్రగతిమైదాన్‌ను సిద్ధం చేయాలి: ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి

రామవరం, అక్టోబర్ 7: సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు ఆదేశాల మేరకు ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి సోమవారం స్థానిక ప్రగతిమైదాన్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 9న ప్రగతిమైదాన్‌లో ఫ్యామిలీ డే, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, అందుకోసం మైదానాన్ని సిద్ధం చేయాలని అధికారులలను ఆదేశించారు. అనంతరం ఏజీఎం సివిల్ సీహెచ్ రామకృష్ణ, ఏరియా వర్క్‌షాప్ ఇంజినీర్ అనిల్, డీజీఎం పర్సనల్ శివకేశవరావుతో కలిసి వివిధ పనులను పరిశీలించారు. గౌతంపూర్, రామవరం పరిసర ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొనున్నారని, ఇందుకోసం ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీవైఎస్ఈ అచ్యుతరామయ్య, సీనియర్ పీవో మజ్జి మురళి, శ్రీనివాసరావు, అనంతరామయ్య, సీహెచ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: డీఎస్పీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 7: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రెహమాన్ అన్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా ఇకపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై కొండపర్తి నరేశ్‌కుమార్ అధ్యక్షతన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం పట్టణం జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడ నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు పలు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రద్దీ ప్రదేశాలు, జాతీయ రాహదారుల వద్ద రోడ్డు ప్రమాదాలను నిర్మూలించేందుకు ట్రాఫిక్ నిబంధనలను పటిష్టంగా అమలు చేస్తామన్నారు. వాహనదారులు ఇకపై మద్యం తాగి వాహనాలు నడిపినా, నిబంధనలు ఉల్లంఘించినా కచ్చితంగా వాహనం సీజ్ చేయడంతోపాటు చోదకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆకతాయిలు రోడ్లపై వికృత విన్యాసాలు చేయడం, బుల్లెట్ ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల ద్వారా శబ్ద కాలుష్యం సృష్టించడం, ఇతరులకు అసౌకర్యాన్ని కలిగించడం వంటివి చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్సై నరేశ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సీజ్ చేసిన వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మణుగూరులో 'జీవీ మాల్' ప్రారంభం

షోరూంలో సందడి చేస్తున్న సినీతార అనసూయ

మణుగూరు టౌన్, అక్టోబర్ 7: మణుగూరులోని అశోక్‌నగర్‌లో సోమవారం అశోక్‌నగర్‌లో 'జీవీ షాపింగ్ మాల్'ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఎస్‌కేటీ గ్రూప్ అధినేత దోసపాటి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన షాపింగ్ మాల్స్‌ను మారుమూల ఏజెన్సీలోకి తీసుకురావడం హర్షణీయమని అన్నారు. సినీతార అనసూయ, జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ వస్త్ర విభాగాలను సందర్శించారు. షోరూం వెలుపల ఏర్పాటు చేసిన స్టేజిపై ఆమె 'పుష్ప' సినిమా పాటలకు స్టెపులు వేసి అందరినీ అలరించారు. విలేకరుల సమావేశంలో షోరూం అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు, నరేన్ మాట్లాడుతూ.. అద్భుతమైన షాపింగ్ అనుభూతిని తమ జీవీ మాల్ అందిస్తుందని అన్నారు.

నేడు భద్రాద్రిలో అధికారిక బతుకమ్మ వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి జిల్లా కేంద్రంలో మంగళవారం అధికారికంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బతుకమ్మ ఉత్సవాల నిర్వహణపై సర్కారు నుంచి నిన్నటి వరకూ ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు సందడి లేకుండా కన్పించాయి. ప్రభుత్వం నుంచి సోమవారం ఆదేశాలు రావడంతో ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఇతర ప్రభుత్వ కార్యాలయం నుంచి జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ, జడ్పీ కార్యాలయాలకు బతుకమ్మలను తీసుకొచ్చి ఆడేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారు.